



ఆగి ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న అంబులెన్స్

సీట్ల 'పొత్తు' ఎలా..?




టిడిపిలో అంతర్మథనం

టిడిపి, జనసేన మధ్య రాజమండ్రి వేదికగా పొత్తు పొడిచింది.. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించినప్పటి నుంచి టిడిపి చేస్తున్న 'నేను సైతం' దీక్షల్లో ఆ పార్టీ శ్రేణులు పాల్గొని సంఘీభావం ప్రకటిస్తున్నారు. పొత్తు హర్షనీయమని ప్రకటనలు చేస్తున్నారు. నాయకులు ఒకరికొకరు అండగా ఉందామని, కలిసి నడుద్దామని ప్రసంగాలు చేస్తున్నారు. అయితే 'పొత్తు' పొడిచినప్పటినుంచి టిడిపి, జనసేన ప్రధాన నాయకత్వంలో అంతర్మథనం మొదలయ్యింది. పొత్తు సరే, సీట్లు ఎలా అనేది వారి చింత. జనసేన ఇప్పటికే కొన్ని సీట్లు బలంగా కేంద్రీకరించి పని చేయాలని చూస్తోంది. ఈ నేపథ్యంలోనే తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోనూ రెండు మూడు సీట్లు ఆశించే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ఆ నియోజకవర్గాలను నమ్ముకుని టిడిపి బలీయంగా ఉంది. ఇటీవల కాలంలో టిడిపిలో చేరిన వారు జనసేన వైపు నుంచి సీటు ఆశించే అవకాశం లేకపోలేదు.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో 14 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ ఉన్నాయి. జనసేన బలిజ సామాజికవర్గం ఎక్కువగా ఉన్న మదనపల్లి, చిత్తూరు, తిరుపతి సీట్లను టిడిపి పొత్తు ఉంటే అడగాలని ఎప్పటినుంచో చర్చ నడుస్తోంది. తిరుపతి పార్లమెంట్ కూడా ఇవ్వాలని పట్టుబట్టనుంది. ఈ నేపథ్యంలో టిడిపి, జనసేన మధ్య పొత్తు పొడవడం, ముందస్తు ఎన్నికలు వస్తాయని ఊహాగానాలు రావడంతో మదనపల్లి ఇన్‌ఛార్జి రాందాస్ చౌదరిని, చిత్తూరులో డికె ఆదికేశవులునాయుడు తనయుడు డిఎ శ్రీనివాసును, తిరుపతిలో పవన్‌కల్యాణ్ లేదా పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్ పోటీ చేయాలనే ఆలోచన ఉంది. ముఖ్యంగా తిరుపతి, చిత్తూరులో బలిజ సామాజికవర్గం ఉండడంతో గెలుపు సునాయాసం అవుతుందని పవన్‌కల్యాణ్ ఆలోచన. తన అన్న చిరంజీవి పాలకొల్లు, తిరుపతిలో పోటీ చేయగా సొంతూరులో ఓడిపోయారు. ఈ నేపథ్యంలో బలిజ



సామాజికవర్గం ఎక్కువగా ఉన్న తిరుపతి అసెంబ్లీకి పంపించారు. మొదటి ప్రాధాన్యత పవన్‌కల్యాణ్ తిరుపతినే ఆశించే అవకాశం ఉంది. తిరుపతి పార్లమెంట్ స్థానాన్ని పలువురు పోటీలో ఉన్నారు. టిడిపి నుంచి మాజీ మంత్రులు పనబాక లక్ష్మి, పరసారత్నం, మాజీ ఎంఎల్‌ఎ నెలవల సుబ్రమణ్యం ఆశిస్తున్నారు. జనసేన తిరుపతి పార్లమెంట్‌పైనా కన్నేసి ఉంది. చంద్రబాబునాయుడు ఈ ముగ్గురు సీనియర్ల భవిష్యత్ ఏంటని చర్చ నడుస్తోంది. ఇప్పటికే మదనపల్లిలో మాజీ ఎంఎల్‌ఎ దొమ్మలపాటి రమేష్, కాంగ్రెస్ నుంచి వైసిపిలో చేరిన మాజీ ఎంఎల్‌ఎ బాషా కూడా టిడిపిలోకి వచ్చారు. అక్కడ వారి పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది. తిరుపతిలో మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ తనకే సీటు వస్తుందని ధీమాతో ఉన్నారు. టిడిపి రాష్ట్ర నాయకులు వూకా విజయకుమార్, ఇటీవలే టిడిపి కండువ ధరించిన టిటిడి బోర్డు మాజీ సభ్యులు ఒవి రమణ సీటు కోసమే వచ్చారు. పొత్తులో భాగంగా సీట్ల సర్దుబాటు జరిగితే టిడిపిలోనూ నేతల చీలిక వచ్చే అవకాశం లేకపోలేదు. అయితే టిడిపి బిజెపితో పొత్తు ఉంటుందని అధికారికంగా ప్రకటించనప్పటికీ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బిజెపి కూడా తమతో కలిసొస్తుందని చెబుతున్నారు. బిజెపి, జనసేన పొత్తులో భాగంగానే తిరుపతి పార్లమెంట్ అడుగుతుంది. బిజెపి సైతం సత్యవేడు నియోజకవర్గం తమకు కేటాయించాలని అడుగుతోంది. ఏదిఏమైనా జనసేన, టిడిపి పొత్తు ఆయా పార్టీలో క్యాడర్‌ను ఉత్సాహపరచినప్పటికీ, నాయకత్వంలో మాత్రం అంతర్మథనం నెలకొంది.

వైద్యం కోసం వచ్చి...

విగత జీవులుగా..!

ఆయిల్ ట్యాంకర్‌ను ఢీ కొన్న అంబులెన్స్

నలుగురు దుర్మరణం

మరో ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఒరిస్సా నుండీ వైద్యం కోసం బెంగుళూరు కిమ్స్ అసుపత్రికి అంబులెన్స్‌లో వచ్చారు. చికిత్స చేయించుకున్నారు. తిరుగు ప్రయాణమయ్యారు.. ఒరిస్సా వెళ్ళేందుకు అంబులెన్స్‌లో ఏడుగురు శుక్రవారం బయలుదేరారు. చిత్తూరు -బెంగుళూరు బైపాస్‌లోని తవణంపల్లి మండలం తెల్లగుండ్ల పల్లి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని వేగంగా అంబులెన్స్ ఢీకొంది. ఈ ఘటనలో నలుగురు మృతిచెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులంతా ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందినవారే. మృతుల్లో ముగ్గురు పురుషులు కాగా, ఒకరు మహిళ ఉన్నారు. వివరాలిలా ఉన్నాయి.

ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన ఉమేష్ చంద్ర (57) గుండెకు సంబంధిన వైద్యం కోసం బెంగుళూరు కిమ్స్ అసుపత్రికి వచ్చారు. చికిత్స అనతరం బెంగుళూరు కిమ్స్ ఆసుపత్రి నుండి ఆదే ఆసుపత్రికి చెందిన అంబులెన్స్‌లో ఉమేష్ చంద్ర, అతడి భార్య మంజులత తో పాటు తమ ప్రాంతానికి చెందిన సమీప బందువులు కూడా ఆదే కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స తరువాత ఒకే అంబులెన్స్‌లో ఏడుగురు కలసి ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌కు బయలుదేరారు. అంబులెన్స్ డ్రైవర్ సంజయ్‌కుమార్, సహాయ డ్రైవర్ జితిన్‌కుమార్‌లతో పాటు టెక్నికల్ అసిస్టెంట్ దేపాటిరాతిదాస్‌లను వెంటబెట్టుకొని ఒరిస్సా రాష్ట్రానికి శుక్రవారం ఉదయాన్నే బెంగుళూరు కిమ్స్ అసుపత్రి నుండీ ఒరిస్సా రాష్ట్రానికి బయలుదేరారు. ఉదయం ఆరు గంటల ప్రాంతంలో చిత్తూరు -బెంగుళూరు బైపాస్ తెల్లగుండ్ల పల్లి వద్ద బెంగుళూరు నుండీ ఒరిస్సాకు వెళ్ళుతున్న ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ రోడ్డు పక్కన ఆపి లారీలోనే విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో అతివేగంగా వెనుకవైపు నుండీ అంబులెన్స్ ఢీకొనడంతో మంజులత, త్రిలోచన, ఉమేష్‌చంద్ర, విజయ్ సంఘటనా స్థలంలో అక్కడిక్కడే మృతి చెందారు. అంబులెన్స్ డ్రైవర్ సంజయ్, జతిన్‌దేవబద్ధ, లారీ డ్రైవర్ శంకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటనా స్థలాన్ని చిత్తూరు డిఎస్‌పి శ్రీనివాసమూర్తి పరిశీలించారు. తవణంపల్లి పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి శత్రువు వైసిపినే.. : ఎస్‌సివి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి శత్రువు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీయేనని, కుదిరితే కమ్యూనిస్టులు, బిజెపిలనూ కలుపుకుని జగన్ ప్రభుత్వాన్ని ఓడిస్తామని మాజీ ఎంఎల్‌ఎ ఎస్సీవి నాయుడు అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికల్లో వైసిపి వ్యతిరేక పార్టీలు 175 స్థానాల్లో గెలవడం ఖాయమన్నారు. టిడిపి అధ్యక్షులు నారా చంద్రాబునాయుడును అప్రజాస్వామిక పద్ధతిలో అరెస్టు చేయడం బాధాకరమన్నారు. వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలంటే టిడిపి, జనసేనలతో కమ్యూనిస్టులు కలిసి రావాలన్నారు. విలేకరుల సమావేశంలో చక్రాల ఉష, నారాయణయాదవ్, గోగినేని భాస్కర్‌నాయుడు, హరిబాబునాయుడు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో ఎస్సీవీ



కొనసాగుతున్న టిడిపి దీక్షలు

పుత్తూరు టౌన్‌లో.. ముస్లీం సోదరులు భవానీనగర్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేసి, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రఫీఅహ్మద్, మహ్మద్‌నబీ,హమీద్‌బాషా పాల్గొన్నారు. **వెదురుకుప్పంలో...** క్లస్టర్ ఇన్‌ఛార్జి పి.మోహన్‌మురళి ఆధ్వర్యంలో మూడో రోజూ దీక్షల్లో పాల్గొన్నారు. త్వరలోనే నిర్దోషిగా చంద్రబాబు బయటకు వస్తారన్నారు. లోకనాథ్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, బియ్యం రవి, రమణారెడ్డి పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో... చంద్రబాబును జైలునుంచి విడుదల చేయాలని గ్రామదేవత సత్యమ్మకు పూజలు చేశారు. నలగాంపల్లి గ్రామదేవత ఎల్లమ్మకూ ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచి ప్రకాష్‌నాయుడు, స్వామిదాస్, గౌతమి, ప్రసన్నకుమారి పాల్గొన్నారు. **గుడిపల్లిలో...** టిడిపికి చెందిన ప్రశాంత్ విజయవాడలోని కనకదుర్గమ్మ గుడికి కాలినడకన వెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. **చంద్రగిరిలో...** శ్రీమూలస్థాన ఎల్లమ్మకు పట్టు వస్త్రాలను పులివర్తి సుధారెడ్డి సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబు కులదైవమైన నాగాలమ్మకు పూజలు చేశారు. **వరదయ్యపాళెంలో..** ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటూ మండల అధ్యక్షులు యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో రిలేదీక్ష నిర్వహించారు. సత్యవేడు టిడిపి ఇన్‌ఛార్జి హెలెన్, మాజీ ఎంఎల్‌ఎ హేమలత పాల్గొన్నారు. జనసేన మండల అధ్యక్షులు చిరంజీవి యాదవ్, సిపిఐ నాయకులు చిన్నిరాజ్ మద్దతు తెలిపారు. **తిరుపతి (మంగళం)లో...** సప్తగిరి కాలనీ గ్రామ పంచాయతీ టిడిపి కమిటీ ఆధ్వర్యంలో అలిపిరి వద్ద టెంకాయలు కొట్టి శ్రీవారికి మొక్కులు తీర్చుకున్నారు. బిసి సెల్ ఉపాధ్యక్షులు పాలముంతల సుబ్బుయాదవ్, జడరెడ్డి భాస్కర్‌రెడ్డి, అల్లాబాషా, హరిక్రిష్ణ, రవికుమార్ పాల్గొన్నారు.

కుప్పం నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్

జిల్లాలో సాగునీటి అవసరాల కంటే తాగునీటి అవసరాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి కె.నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం జడ్పీ సమావేశపు మందిరంలో ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాలు జిల్లా కలెక్టర్ ఎస్. షణ్మోహన్ అధ్యక్షతన జరిగాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర అటవీ, ఇంధన, విద్యుత్, శాస్త్ర సాంకేత, పర్యావరణ, భూగర్భ గనుల శాఖ మంత్రి డా. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

వీరితో పాటు చిత్తూరు ఎంపి ఎన్. రెడ్డప్ప, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంఎల్‌సి భరత్, చిత్తూరు శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు, డిఎఫ్ఓ చైతన్య కుమార్ రెడ్డి, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్‌లు రమ్య, ధనుంజయ రెడ్డి, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ శాంతి, డి సి సి బి చైర్ పర్సన్ రెడ్డమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి అవసరాల కంటే తాగునీటి అవసరాలకు అధిక ప్రాధాన్యత, 2023-24 ఫసలీ, 1,434 రబీ సాగుకు గానూ చెరువుల నుండి తాగు నీటి సరఫరా, నీటి పారుదలకు సంబంధించిన అంశాల పై చర్చించారు. జిల్లాలో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకునేలా తగు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అందించడంలో భాగంగా హంద్రీ - నీవా కాలువ పనులను పూర్తి చేసి త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై. యస్. జగన్ మోహన్ రెడ్డి ద్వారా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. హంద్రీ - నీవా కాలువ ద్వారా దాదాపుగా వంద చెరువులను నింపుతూ కుప్పం నియోజకవర్గానికి గల నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారించడం జరుగుతుందని, యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని, త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా కుప్పం నియోజకవర్గానికి నీటిని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించుకుంటామని తెలిపారు. బైరెడ్డిపల్లి, వి.కోట మండలాలకు తాగునీరు అందించడంలో భాగంగా కైగల్ నది పై రిజర్వాయర్‌ను నిర్మించుటకు రూ.20.50 కోట్లతో, కుప్పం నియోజకవర్గ పరిధిలోని పాలార్ నది వద్ద చెక్ డ్యామ్ లు నిర్మించుటకు అవసరమయ్యే ఖర్చుల అంచనాలను సిద్ధం చేసి పరిపాలనా మంజూరు కొరకు ప్రభుత్వానికి పంపడమైనదని తెలిపారు. నలగాంపల్లి వద్ద గల గంగమ్మ శిరస్సు వంక పై రిజర్వాయర్ నిర్మించి పలమనేరు పట్టణానికి తాగు నీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. చిత్తూరు, పూతలపట్టు శాసన సభ్యుల అభ్యర్థన మేరకు పూతలపట్టు మండలం చామంతి పురం వద్ద వై. యస్. ఆర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటుకు అవసరమైన అంచనా ఖర్చులను తయారు చేయాలని తెలిపారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ నుండి గ్రావిటీతో యమనూరు వద్ద గల 1 టిఎంసి సామర్థ్యం గల రిజర్వాయర్ కు నీటిని అందించుటకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపడమైనదని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు తాగునీటికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు చేపట్టడం



జరుగుతున్నదని తెలిపారు. ప్రాజెక్టు లలో ఉన్న నీటి నిల్వను పరీక్షించి అందుకు అనుగుణంగా ఆర్ డబ్ల్యూ ఎస్, ఇరిగేషన్ శాఖల ద్వారా ముందస్తు చర్యల కొరకు తగు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జూలై, ఆగస్టు 2023 నెలలో ఆశించిన మేర వర్షపాతం నమోదు కాలేదన్నారు. కష్ణాపురం ప్రాజెక్టు ద్వారా 6,125 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించడం జరుగుతుందని, రబీకి 4,125 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించటకు ప్రతిపాదించడం జరిగిందని, కలవకుంట జలాశయం ద్వారా చిత్తూరు పట్టణానికి త్రాగునీరు అందించడం జరుగుతుందని, 4,122 చిన్న నీటి పారుదల ప్రాజెక్టుల ద్వారా 1,12,996 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించడం జరుగుతుందని, చిత్తూరు పట్టణం లో గల గంగినేని చెరువులో గల గుర్రపు డెక్క కలుపు నుతొలగించడమైనదని, ఏ పి ఐ ఎల్ ఐ పి ద్వారా రూ.49 కోట్లతో 06 పనులకు పరిపాలనా ఉత్తర్వులు మంజూరు కాగా 05 పనులు వివిధ దశలలో ఉన్నాయని తెలిపారు. ఎన్ ఎస్ పి ద్వారా రూ.507 కోట్లతో 19 పనులు మంజూరు కాగా 12 పనులు వివిధ దశలలో నిర్మాణం లో ఉన్నాయని, 6 పనులు టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. రాయలసీమ డ్రాట్ మిటిగేషన్ ప్రోగ్రామ్ ద్వారా రూ.2,144కోట్లతో అవులపల్లి, నేతిగుంటపల్లి, ముదివేడు వద్ద మూడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను నిర్మించి పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా పశ్చిమ మండలాలకు గండికోట నీటిని అందించుటకు కషి చేస్తున్నామని, కుప్పం నియోజకవర్గ పరిధిలో వరదల వల్ల దెబ్బతిన్న చెరువులు, కుంటల మరమ్మత్తులకు రూ.6.31 కోట్లతో అంచనాలను, కౌండిన్య నది పై 11 చెక్ డ్యామ్ ల నిర్మాణానికి రూ.23 కోట్ల అంచనాలను ప్రతిపాదించి ప్రభుత్వానికి సమర్పించడమైనదని ఇరిగేషన్ ఎస్ ఈ విజయ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ సలహామండలి ఛైర్మెన్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ పోస్టర్ల, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకులను పూజించే అవగాహన పోస్టర్లు విడుదల చేశారు.

నేడు కాపునేస్తం లబ్ధి : కలెక్టర్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి 4 వ విడత వై.యస్.ఆర్ కాపు నేస్తం కార్యక్రమాన్ని తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నుండి కంప్యూటర్ బటన్ నొక్కి శనివారం ప్రారంభించనున్నారని కలెక్టర్ ఎస్.షన్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా సచివాలయం లోని వీడియో కాన్ఫరెన్స్ నుండి వర్చువల్ విధానం లో జిల్లా కు చెందిన మంత్రులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ పథకం ద్వారా జిల్లాలోని 45 నుండి 60 సంవత్సరముల మధ్య వయసు గల బలిజ, తెలగ, ఒంటరి మహిళలకు ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున 7091 మందికి రూ.10.636 కోట్లు లబ్ధి చేకూరనుందని తెలిపారు.

జిజేఎం ట్రస్టుచే మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్

జీజేఎం ఛారిటబుల్ పౌండేషన్ తరపున చిత్తూరు నియోజకవర్గ పుర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం స్థానిక లక్ష్మీ నగర్ కాలనీ లోని జి జె యం చారిటబుల్ పౌండేషన్ కార్యాలయంలో వినాయక పర్వదినాన్ని పురస్కరించుకొని మట్టితో నిర్మితమైన వినాయక విగ్రహాల పంపిణీని ట్రస్టీ గురజాల చెన్నకేశవ నాయుడు, 8వ వార్డు మాజీ కార్పొరేటర్ శేషాద్రి నాయుడు కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు హేమాద్రి నాయుడు, మూతం ప్రవీణ్ కుమార్, సుధాకర్ నాయుడు, నగర మాజీ యువత అధ్యక్షుడు వినయ్ చౌదరి పాల్గొన్నారు.





అందరికీ అందుబాటులో బీసీ భవనం : పెద్దిరెడ్డి

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతత్వంలో అన్ని వర్గాల అభివద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్యుత్, అటవీ పర్యావరణ, భూగర్భ గనుల శాఖ మంత్రి డా. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం చిత్తూరులోని పివికేఎన్ కళాశాల సమీపంలో 4.43 కోట్ల ఖర్చుతో నిర్మించిన జ్యోతిరావు పూలే భవనంను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే. నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎం పి ఎన్. రెడ్డెప్ప, జెడ్ పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ ఎస్. షణ్మోహన్ లతో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర అటవీ శాఖ మంత్రులు మాట్లాడుతూ రూ. 4.43 కోట్ల ఖర్చుతో జిల్లా కేంద్రంలో జ్యోతిరావు పూలే భవనం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రధాన రహదారి పక్కనే ఈ భవనం నిర్మించడం అన్ని రకాలుగా అనువుగా ఉంటుందని అన్నారు. వీరితో పాటు ఎం ఎల్ సి భరత్, చిత్తూరు శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు, నగర మేయర్ అముద, డిఆర్ఓ ఎన్. రాజశేఖర్, రాష్ట్ర ఎపిఎస్ ఆర్టిసి వైస్ ఛైర్మన్ విజయానంద రెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ బుల్లెట్ సురేష్ పాల్గొన్నారు.

మట్టి వినాయకుని పూజిద్దాం :కలెక్టర్

తిరుపతి టౌన్ : మట్టి వినాయకుని పూజిద్దాం , భక్తితో పాటు పర్యావరణానికి మేలు చేసే విధంగా ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఈ ఏడాది మొదటి పండుగ జరుపుకుందామని కలెక్టర్ కె వెంకట రమణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం తుడా మైదానం ఇండోర్ స్టేడియంలో శ్రీ వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ఆహ్వానము మేరకు జిల్లా కలెక్టర్ హాజరై విఘ్నేశ్వరునికి పూజలు చేసి, మట్టి వినాయకుడిని పూజిద్దాం - పర్యావరణాన్ని కాపాడుదాం గోడపత్రికలను ఆవిష్కరించారు.

గత సంవత్సరం చెన్నాయ గుంట దామినేడు వద్ద నిమజ్జనంలో ఇబ్బందులు కలిగాయని గుర్తించి వాటికోసం ఈ ఏడాది తుడా విసి హరికష్ణ, జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్ రెడ్డి కి ఆదేశాలు ఇచ్చామని బ్యారికెడు ఏర్పాట్లను సౌకర్యాలను పరిశీలిస్తారని అన్నారు. తిరుపతి నగరంలో దాదాపు 800 వరకు విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారని ఈనెల 18న వినాయక చవితి రోజు పూజలు నిర్వహణ చేపడతారని, మూడవరోజు నిమజ్జనానికి వినాయక సాగర్ నందు ఏర్పాట్లు జరిగాయని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఐదవ రోజు శుక్రవారం కావడం, తిరుమల శ్రీవారి గరుడ సేవ రోజు గా వుందని మూడవ రోజు నిమజ్జనానికి ప్రాధాన్యత నిస్తే బాగుంటుందని అన్నారు. వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ప్రతినిధులు చామంచి శ్రీనివాస్, బాను ప్రకాష్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, మునికష్ణ, గోపాల్ రెడ్డి, గోపి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

అమర ఆస్పత్రిలో ల్యాప్రోస్కోపీ చికిత్స

ప్రజాశక్తి - రేణిగుంట

రేణిగుంట రైల్వే కోడూరు మార్గంలోని అమర హాస్పిటల్ నందు హయత్ బీ (56) కడుపు ఉబ్బరంతో, వాంతులతో ఇబ్బంది పడుతూ అమర హాస్పిటల్‌కి వచ్చింది. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ మునికష్ణను సంప్రదించగా ప్లీహంలో క్యాన్సర్ లింపోమా వలన రక్తహీనత వచ్చిందని, 3.5 కిలోల బరువు కలిగిన ప్లీహం భారీగా పెరిగిందని గమనించారు. గురువారం సర్జరీతో తొలగించారు. డాక్టర్ మునికృష్ణ మాట్లాడుతూ అమర ఆస్పత్రిలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ డిపార్టుమెంట్‌లో జీర్ణకోశ వ్యవస్థలోని ఎలాంటి సమస్యకైనా క్యాన్సర్ సంబంధిత సమస్యకైనా ల్యాప్రోస్కోపీ ద్వారా అత్యుత్తమ చికిత్స అందుబాటులో ఉందని తెలిపారు.





శ్రీకాళహస్తిలో సిపిఎంలోకి వలసలు

సీపీఎంలోకి సంక్రాంతి, రాపూరు


ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సీపీఎం మాజీ కార్యకర్తలు సంక్రాంతి వెంకటయ్య, రాపూరు సుబ్రమణ్యంలు తిరిగి వారి మాత పార్టీలో చేరారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో శుక్రవారం జరిగిన సీపీఎం ప్రాంతీయ నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తల సమాశంలో వారిరువురు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు సమక్షంలో తిరిగి మాత పార్టీలోకి రావడం జరిగింది. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ దేశంలో రాజకీయ పరిస్థితులు నానాటికీ దిగజారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలక ప్రభుత్వాలు కార్పొరేట్ల చేతుల్లో కీలుబొమ్మలవుతున్న నేపథ్యంలో దేశంలో ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, ఆకలి పెచ్చుమీరుతున్నాయని వాపోయారు. ఈ తరుణంలో ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు దేశ ప్రజలు చూస్తున్నారనీ, ఆ ప్రత్యామ్నయం కమ్యూనిస్టులే అవ్వాలని చెప్పారు. సీపీఎంలో చేరుతున్న వారంతా పార్టీ లక్ష్యాల కోసం పనిచేయాలనీ, కార్మిక, కర్షక, బడుగు బలహీన వర్గాల పక్షాన పోరాడాలని పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం పారిశ్రామికంగా దినదినాభివద్ధి చెందుతోందనీ, కర్మాగారాల్లో పని చేస్తున్న కార్మికుల శ్రమను యాజమాన్యాలు దోపిడీ చేస్తున్నాయనీ, వారి పక్షాన పోరాడేందుకు సిపిఎం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాపూరు, సంక్రాంతి తో పాటు మరో పది మంది యువకులు చేరారు. నాయకులు అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్, గంధం మణి, పెనగడం గురవయ్య, కుమార్, నాగరాజు, వెంకటేష్, రమేష్, చెంగయ్య, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

సీటు ఎవరికో...

- నియోజకవర్గంలో మొదలైన చర్చ
- ఒకరు అందరికీ తెలిసిన వారే.. మరొకరు కొత్తగా వచ్చిన వారు..
- జనసేన, టిడిపిలు ఒకటి కావడంతో ఇద్దరిలో ఎవరో..?

ప్రజాశక్తి -వెదురుకుప్పం: గతంలో జనసేన, టిడిపిలు వేరువేరుగా పోటీ చేస్తాయని అధిష్టానం చెబుతూ ఉండేది. ప్రస్తుతం రాజకీయ పరిణామాలు మారాయి. రాబోయే ఎన్నికల్లో జనసేన, టిడిపిలు రెండు కలిసి ముందుకు వెళుతున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. దీంతో గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో టికెట్టు ఎవరికి వస్తుందోనని చర్చ మొదలైంది. ఇక అసలు విషయానికి వస్తే గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి ప్రస్తుతం డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇతను వైసిపి అభ్యర్థి.. ప్రస్తుతం గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉన్నాయి. కార్వేటి నగరం, పాలసముద్రం, ఎస్ ఆర్‌పురం, గంగాధర నెల్లూరు, పెనుమూరు, వెదురు కుప్పం మండలాలు ఉన్నాయి. ఈ నియోజక వర్గం పునర్విభజన తర్వాత ఎస్‌సి రిజర్వేష న్‌కు కేటాయించారు. ఈ నేపథ్యం లో జనసేన తరపున పొన్న యుగంధర్, టిడిపి తరపున థామస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యులుగా ఉన్నారు. వీరే టికెట్టు ఆశిస్తున్నారు. ప్రస్తుతం రేసులో ఉన్నారు. స్థానికుల అభిప్రాయం మేరకు జనాలలో ఇప్పుడు ఉంటూ..ప్రజలకు ఏ కష్టమైనా ఏదైనా సమస్య ఉన్న వెంటనే స్పందించే వ్యక్తి పొన్న యుగంధర్ అని చెబుతున్నారు. సమస్యల పోరాటం కోసం ఎక్కువగా స్పందించే వ్యక్తి.. నియోజకవర్గంలో ఎన్నో సమస్యలపై పోరాటం చేసి పరిష్కరించిన వ్యక్తి కూడా యుగంధరే.. అందరికీ తెలిసిన వ్యక్తి.. కార్వేటినగరం మండ ల మే..ఇక టిడిపి అభ్యర్థి అయిన థామస్ కార్వేటి నగరం మండలానికి చెందిన వ్యక్తి. వృత్తిరీత్యా చెన్నైలో స్థిరపడ్డారు. వివిధ నగరాల్లో ప్రముఖంగా వైద్యా నికి సంబంధించిన బ్రాంచీ లు ఉన్నాయి. ఎవరి వైపు అధిష్టానం మొగ్గు చూపుతుందో వేచి చూడాలని స్థానికులు చెబుతు న్నారు. ఎవరికి ఇచ్చినా కలిసి కట్టుగా పని చేస్తా మంటున్నారు.


గంగాధర నెల్లూరులో చంద్రబాబు కోసం రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న పొన్న యుగంధర్, డాక్టర్ థామస్..

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం:జెసి



ప్రజాశక్తి -రామకుప్పం: జగనన్న కు చెబుదాం స్పందన కార్యక్రమంలో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీల ను వెంటనే పరిష్కరించాలని జెసి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు.శుక్రవారం రామకుప్పం ఎంపిడిఓ కార్యాలయపు సమావేశం హాలులో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని, మండలం లోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల గురించి వారిని అడిగి తెలుసుకుని వారి నుండి అర్జీలను స్వీకరించారు.అంతకు ముందు జె సి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లి ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం మండల స్థాయిలోనే ప్రజల సమస్యల పరిష్కారం కోసం వారం లో రెండు రోజులు ప్రతి బుధవారం, శుక్రవారలలో మండల స్థాయి లో జగనన్న కు చెబుదాం కార్య క్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజలు అంద జేసిన సమస్యలు మండల స్థాయి లోనే సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, పరిష్కారం కాకుంటే సమాచారాన్ని అర్జీదారులకు వివరించాలని అధికారులను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం స్పందన లో ఇచ్చిన ప్రతి అర్జీని కంప్యూటర్ లో నమోదు చేసి అర్జీదారులకు రసీదు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మండలం లోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుండి 206 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఆర్డీఓ శివయ్య, పి డి డిఆర్డీఏ తులసి ,డిపిఓ.లక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమ, సాధికారత అధికారి చిన్నారెడ్డి, డీఈఓ విజేయేంద్ర రావ్, వివిధ శాఖల మండల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన మండలం లోని వేపంజేరికి సమీపంలో గురువారం రాత్రి చోటుచేసు కుంది. గంగాధర నెల్లూరు మండలంలోని బుక్కాపట్నం దళితవాడకు చెందిన నాగరాజు కుమారుడు మోహన్ (22) కట్టకిందపల్లె దళితవాడ లోని వారి బంధువులు ఇంటికి వచ్చి, తిరుగు ప్రయాణంలో వేపంజేరి కి సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి తీవ్ర గాయాలకు గురైనట్లు ఆదారిలో వెళుతున్న వాహన దారులు గుర్తించారు. ఈ ప్రమాదంలో అతనికి తలకు బలమైన గాయా లు తగలడంతో ముక్కు, చెవుల్లో రక్త స్రావమైంది. 108 వాహనానికి సమాచారం ఇచ్చి ఆ యువకుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయువకుడు మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో మోహన్ మోటార్ సైకిల్ లో వెళుతుండగా అదుపుతప్పి ప్రమాదవశాత్తు పడి మరణించాడా? లేకుంటే ఏదైనా వాహనం ఢీకొనడంతో మరణించాడా?అనేది తెలియడంలేదు. కాగా మృతుడు కుటుంబ సభ్యులు గంగాధర నెల్లూరు పోలీస్ లకు ఫిర్యాదు చేశారు.

అదృశ్య యువతి తల్లిదండ్రులకు అప్పగింత



ప్రజాశక్తి -సోమల: సోమల మండలం అన్నెమ్మ గారి పల్లి పంచాయతీ బోనమంద గ్రామానికి చెందిన ఆనంద కుమార్తె గీత(18) చదువు కుంటూ ఉండగా తల్లిదండ్రులు వివాహం చేయాలని సంబంధాలు చూస్తుండడంతో ఇంటి నుండి పారిపోవడంతో సోమల పోలీసులకు గత నెల 28 న తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఎస్సై వెంకట నరసింహులు ఆధునిక పరిజ్ఞానంతో యువతి ఆచూకీ కనుక్కొని గంగవరం మండలం గొర్రెల దొడ్డి గ్రామంలోని తన చిన్నాన్న ఇంటి వద్ద ఉండగా సోమలకు తీసుకువచ్చి శుక్రవారం తహసిల్దార్ మాధవ రాజు ఎదుట హాజరు పరిచి తల్లిదండ్రు లకు అప్పగించారు. దీంతో యువతి తల్లిదండ్రులు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం- మహిళ అరెస్టు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ వడ్డిపల్లి గ్రామానికి చెందిన మంజుల అనే మహిళ ఇంటిలో కర్ణాటక మద్యం నిల్వ ఉంచి ఉందన్న పక్కా సమాచారం మేరకు సెబ్ అధికారులు శుక్రవారం ఉదయం మద్యం దాచి ఉన్న ఇంటిపై ఆకస్మిక దాడి చేసి 768 బెంగళూరు విస్కీ(టెట్రా ప్యాకెట్లు) స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్టు పుంగనూరు ఎస్ ఈ బి ఇన్‌స్పెక్టర్ సీతారామిరెడ్డి తెలిపారు. పట్టుబడ్డ కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్ల విలువ 25వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ జి అశోక్ కుమార్, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి..

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండల పరిధిలోని గ్రామాల్లో ఎక్కడైనా వినాయక చవితి నిర్వహించడానికి పోలీసుల నుండి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని గంగాధర నెల్లూరు ఇన్‌ఛార్జిఎస్‌ఐ ఉమామహేశ్వర్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఈనెల 18 నుంచి వినాయక చవితి సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసి ,ఉత్సవాలు నిర్వహించేవారు నిమజ్జనం కోసం నిర్వాహకులు తేదీలు ముందస్తుగా రాతపూర్వకంగా తెలిపి పోలీసుల అనుమతి తీసుకోవాలని ఆయన తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విద్యార్థుల వితరణ



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండ లంలోని డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువు తున్న బీకాం (సి.ఏ) 2021-2024 బ్యాచ్ విద్యార్థులు రూ.7800 విలువ కలిగిన బీరువా. రూ.1560 రూపాయలు విలువ కలిగిన ఆరు కుర్చీలను ఆ కళాశాలకు శుక్రవారం వితరణ చేశారు. నూతన కళాశాలలో కామర్స్ డిపార్టుమెంట్ అభివృద్ధిలో భాగంగా బీకాం మూడవ సంవత్సరం విద్యార్థులు అందరూ కలిసి డిపార్టుమెంట్‌పుస్తకాలకు , ఫైళ్లను భద్రపరచడానికి బీరువాను వితరణ చేసినట్లు తెలిపారు. స్టాఫ్ రూమ్ లో అధ్యాపకులకు అనుకూలంగా ఆరు కుర్చీలను వితరణ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. అన్నపూర్ణ శారద ఈ వితరణ అందుకుని విద్యార్థు లందరూ ఇలాగే సాయం చేయడానికి ముందుకు రావాలని, కళాశాల అభివృద్ధిలో అంతర్భాగం కావా లన్నారు. అధ్యాపకులు మూడవ సంవత్సర బీకాం (సీఏ) విద్యార్థు లను ప్రశంసించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే



ప్రజాశక్తి -సోమల: జగనన్న ఆరోగ్య సురక్ష లో భాగంగా మండల కేంద్రమైన సదుం లో వైద్య సిబ్బంది వాలంటీర్లు కలిసి ఇంటింటి సర్వే చేపట్టారు. సర్వేలో పాల్గొన్న ఎంపీడీవో వరప్రసాద్ మాట్లాడుతూ ప్రజలందరూ తమ ఆరోగ్యం వివరాలను వాలంటీర్లకు వైద్య సిబ్బందికి తప్పక అందజేయాలని దీనివల్ల ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు అవకాశం ఏర్పడుతుందని అన్నారు. పంచాయతీ కార్యదర్శి హసీనా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఇందుకోసం వివరాలను వాలంటీర్లకు అందజేసి సంబంధిత ఫారం నందు పొందుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఉషారాణి, ఆరోగ్య సిబ్బంది హేమలత, దీప వాలంటీర్లు పాల్గొన్నారు.

67వ స్కూల్ గేమ్స్‌కు మండల స్థాయిలో పోటీలు



ప్రజాశక్తి-నగరి :67వ స్కూల్‌గేమ్స్ లో భాగంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అండర్ 14, 17 బాల బాలికలకు మండల స్థాయి కబడ్డీ, యోగా టోర్నమెంట్, నియోజకవర్గ స్థాయి సెలక్షన్స్ నిర్వహించగా స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో అండర్ 14, 17 బాల బాలికలకు మండల స్థాయి వాలీబాల్ పోటీలు నియోజక స్థాయి సెలక్షన్స్ నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం, ప్రధానోపాధ్యాయులు పార్వతీ దేవి, శ్యామలాదేవి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. సుమారు 200 మంది క్రీడాకారులు ఈ పోటీలకు పాల్గొన్నారు. మండల స్థాయి పోటీలను మండల ఇన్‌చార్జ్ చెన్నకేశవులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మణి, ఉమెన్ సీనియర్ పీడీ రాజేశ్వరి, పీడీలు చంద్రమ్మ, సింధు, స్వప్న, గౌరీ సానీ, గీతమ్మ నిర్వహించగా నియోజవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపికలో సెలక్షన్ కమిటీ సభ్యులుగా వ్యవహరించిన సతీష్, సుమన్, విజయ్, వేలు, కేశవులు వ్యవ హరించారు. త్వరలో మండలస్థాయి ఖోఖో, త్రోబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీలకు సంబందిత పోటీలు, ఎంపిక పూర్తిచేస్తామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు తెలిపారు. అనంతరం నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు నిర్వహి స్తామన్నారు.

ప్రజాశక్తి -పాలసముద్రం: పాలసముద్రం మండలం వెంగళరాజు కుప్పం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు రాజేంద్రప్రసాద్ గిరిజ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల తహశీల్దార్ బాబు హాజరయ్యారు .పదిహేడు సంవత్సరాల బాల, బాలికలకు, శుక్రవారం మండల స్థాయి సెలక్షన్ పోటీలు వెంగళరాజు కుప్పం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్వహించడం జరిగింది. ఈ ఆటల పోటీల్లో మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, పాఠశాలల నుంచి సుమారు 200 వందల మంది క్రీడాకారులు ఈ సెలక్షన్ కు హాజరయ్యారు. బాల బాలికలకు వేర్వేరుగా వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోహర్ నాయుడు, చక్రధరావు , మీనాక్షి, ఏలుమలై, సిఆర్పిలు పిటి మాస్టర్లు, క్రీడాకారులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఫోటో రైట్ అప్ క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న తహసీల్దార్ బాబు ఎంపిడీవో ప్రేమ్ రాజ్ కుమార్, పాల్గొన్నారు.

పగిలిన తాగునీటి పైపులు.. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



ప్రజాశక్తి -సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూ రు గ్రామం లోని ప్రధాన రహదారి రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు చోట్ల త్రాగునీటి పైపులు పగిలిపోవడంతో సర్పంచి భాషా మసూద్ ఎప్పటి కప్పుడు మరమ్మతులు చేయిస్తూ ప్రజలకు ఇబ్బంది కలగకుండా తాగునీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి జయశంకర్ తాగునీటి సరఫరాను పర్యవేక్షిస్తూ మరమ్మతులు చేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మెకానిక్ మహబూబ్ భాష, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలకృష్ణారెడ్డి మృతి వైసిపికి తీరని లోటు: మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-రొంపిచెర్ల: మండల వైసిపి నాయకులు బాలకృష్ణారెడ్డి మృతి వైసిపికి తీరని లోటని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం చెంచమరెడ్డి గారి పల్లెలో గుండెపోటుతో మృతి చెందిన బాలకృష్ణారెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీనియర్ నాయకులు మృతి చెందడంతో పార్టీకి పెద్ద లోటన్నారు. పార్టీ కష్ట కాలంలో కూడా తన వెంట నడిచారని గుర్తు చేశారు. తాను బాలకృష్ణారెడ్డి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా కల్పించారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- గడప గడపకు మన ప్రభుత్వం లో డిప్యూటీ సీఎం



ప్రజాశక్తి -కార్వేటినగరం: పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గాజంకి సచివాలయ పరిధిలోని రౌతువానిగుంట, విరాటపురం, క్రిష్ణాపురం, దిగువ ఎర్రమరాజుపల్లి, ఎగువ ఎర్రమరాజుపల్లి, దళితవాడ, గాజంకి, గాజంకి దళితవాడ, అమ్మోరుగుంట గ్రామాల్లో సర్పంచులు చిన్నబ్బరెడ్డి, హరోహరరెడ్డి, ఎంపీటీసీ పుత్తూరు రాధికారెడ్డి,మాజీ ఎంపీటీసీ మురగయ్య ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వంకి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమాలు అందిస్తోందని గుర్తు చేశారు. ప్రతి ఇంటికీ లక్ష నుంచి 6 లక్షల వరకు లబ్ధి చేరుకూరుతోందని తెలిపారు. పేదల పాలిట కల్పవృక్షంగా నిలుస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించి రానున్న ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించాలని పిలుపు నిచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసమే సీఎం గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వ అధికారులను చేరువ చేశారన్నారు. పుట్టబోయే శిశువు నుంచి మృతి చెందే వృద్ధుడి వరకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమాలకు లబ్ధిదారులు మంత్రులు, ఎమ్మెల్యేలను చిరునవ్వుతో ఆహ్వానిస్తూ, మంగళహారతులు పడుతు న్నారని తెలిపారు. పేదల ఆశీర్వాదాలే తమకు శ్రీరామ రక్ష అన్నారు. ఈ క్రమంలో భాగంగా రౌతువాని గుంట దళితవాడ, విరాటపురం గ్రామాల్లో విద్యుత్ తీగలు ఇళ్లపై ఉందని మంత్రి దృష్టికి తీసుకు రావడంతో వెంటనే తొలగించాలని విద్యుత్ ఏడీఈ నాగరాజును ఆదేశించారు. ఎర్రరాజుపల్లి, గాంజకి, గాజంకి దళితవాడలో మురుగు నీటి కాలువలు ఏర్పాటు చేయాలని చెప్పడంతో స్పందించిన మంత్రి వెంటనే మురుగు నీటి కాలువలు నిర్మాణం చేపట్టి నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, జిల్లా కోశాధికారి ధనంజయరెడ్డి, కృష్ణారెడ్డి, ధనంజయవర్మ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్రెడ్డి, చందురాజు, మాజీ సర్పంచ్ చెంచయ్య, రాజారెడ్డి, వరాలురెడ్డి, ఉప సర్పంచ్ దొరస్వామి, ఎంపీడీవో మోహన మురళీ, తహశీల్దారు రవికుమార్, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బాబుతో పవన్ ప్యాకేజీ మిలాఖత్ : మంత్రి



ప్రజాశక్తి -నగరి : బాబుతో పవన్ ప్యాకేజీ మిలాఖత్ బహిర్గతమైందని మంత్రి ఆర్కేరోజా అన్నారు. టీడీపీతో కలిసి పోటీచేస్తామని పవన్‌కళ్యాణ్ ప్రకటించడంపై ఆమె మీడియాతో మాట్లాడారు. జగనన్న చాలా ముందు చూపున్న వ్యక్తి కావడం వల్లే పవన్ కళ్యాణ్ అనే వ్యక్తి దత్తపుత్రుడు, ప్యాకేజీ స్టార్ అని మొదటి నుంచి చెబుతున్నారన్నారు. దేశంలోనే పార్టీ పెట్టి పక్కవాడి కోసం తాను పనిచేయడమే కాకుండా తన కార్యకర్తలను కూడా జెండా కూలీలుగా మార్చి ఇతర పార్టీల జెండాను మోయించే ఏకైక నాయకుడు పవన్ కళ్యాణ్ అన్నారు. జైల్లో ఖైదీగా ఉన్న నాయకునితో పొత్తు పెట్టుకున్న ఏకైక పార్టీ జనసేన అన్నారు. ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని బూతులు తిట్టించి, కొట్టి హింసిస్తే.. ఎందుకు ఆనాడు ఎందుకు పోరాటం చేయలేదన్నారు. సంఘీభావం తెలపడానికి వచ్చిన చిరంజీవిని అరెస్టు చేస్తే ఎందుకు నోరు తెరవలేదన్నారు. కాపుల మీద చంద్రబాబు అక్రమ కేసులు పెట్టి, లాఠీ ఛార్జ్ చేసినపుడు పవన్ కళ్యాణ్ ఏమయ్యారన్నారు. నేడు ప్యాకేజీ కోసం నిస్సిగ్గుగా చంద్రబాబు కోసం పనిచేస్తున్నట్లు పవన్‌కళ్యాణ్ ప్రకటించారన్నారు. తన ప్యాకేజీ కోసం, దొంగ కోసం నమ్మిన కార్యకర్తలను రోడ్డుమీదకు తీసుకొచ్చిన పవన్ కళ్యాణ్‌ను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు.. స్కిల్ డెవలప్ మెంట్ స్కాంలో చంద్రబాబు ఎక్కడా సంతకాలు పెట్టలేదని చెప్పే వపన్ 13 చోట్ల చంద్రబాబు ఎక్కడెక్కడ సంతకాలు పెట్టాడో ప్రూఫ్‌లతో సహా సీఐడీ చీఫ్ క్లియర్‌గా చూపించారని.. చదువు రాకపోతే సీఐడీ ఆఫీసుకు వెళ్లి భూతద్దం పెట్టుకుని వెతికి చూసుకోవాలన్నారు. తాను ఒకటి తలిస్తే దైవం ఒకటి తలచినట్టుగా చేసిన తప్పులకు ఈరోజు చంద్రబాబు అరెస్ట్ అయ్యాడే తప్ప, ఇది అక్రమ కేసు కాదని వీటితో జగన్‌మోహన్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదన్నారు.

స్పందన అర్జీల పరిష్కారానికి కృషి చేయాలి



ప్రజాశక్తి-రామకుప్పం : రామకుప్పం మండలం లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిస్కారం పై త్వరలోనే సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం రామకుప్పం నందు నిర్వహించిన జగనన్న కు చెబుదాం స్పందన కార్యక్రమం అనంతరం జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ రామకుప్పం మండలం నందు నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారం పై 15 రోజుల తర్వాత సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్జీల కు సంబంధించి మీ పై స్థాయి అధికారుల దృష్టి కి తీసుకెళ్లి సమస్యలను పరిస్కారించాలని ఆదేశించారు. అసైన్మెంట్ ల్యాండ్ లో సాగు చేసుకున్న సాగు దారులను గుర్తించి జాబితా ను తహశీల్దార్ కు అందజే యాలని వి ఆర్ ఓ లను ఆదేశిం చారు. తహశీల్దార్ పరిశీలించి నివేదికను ఆర్డీవోకు పంపించాలని తహశీల్దార్ ను ఆదేశించారు. మండల పరిధిలోని ఎస్సీ ,ఎస్టీ గ్రామాలలో స్మశాన వాటిక ఏర్పాటుకు సంబంధించి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములను పరిశీలించాలని, అవసరమైతే ప్రైవేటు భూముల ను పరిశీలించి ప్రతిపాదనలను కలెక్టర్ కార్యాలయానికి పంపించాలని తహశీల్దార్ మురళి ను ఆదేశించారు. ఈ సమావేశంలో కుప్పం ఆర్డీఓ శివయ్య, డిఆర్డీఏ పిడి తులసి,డిపిఓ లక్ష్మి,డిసిఓ బ్రహ్మానంద రెడ్డి, డియల్ డి ఓ రవికుమార్,వివిధ శాఖల మండల,జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైసిపి మండల అధ్యక్షులుగా రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: వైసిపి మండల అధ్యక్షులుగా పాలేరు చెందిన పాలకూర రామచంద్రారెడ్డి నియమితులయ్యారు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు శుక్రవారం నియమితులైనట్లు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని రాబోవు శాసనసభ ఎన్నికల్లో పార్టీకి అన్ని విధాల సహకరించి పార్టీ బలోపేతానికి పని చేస్తామన్నారు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు నాయకులను కలుపుకొని తిరిగి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు పనులు చేయనున్నట్టు తమపై నమ్మకం ఉంచి మండల అధ్యక్ష పదవి సహకరించిన ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.

అక్రమ అరెస్టులు ఇంకెంత కాలం? : టిడిపి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం :అక్రమ అరెస్టులు ఎంతకాలమని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గస్థాయి రిలే నిరాహార దీక్ష కార్యక్రమం పూతలపట్టు కేంద్రంలో బంగారు పాళెం మండల టిడిపి అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేయని నేరానికి చంద్రబాబు నాయుడుని జైలుకు పంపారని రాష్ట్ర అభివృద్ధి కోసం సిల్క్ వే ప్రారంభించి పలువురు యువతి యువకులను అభివృద్ధి దిశగా తీసుకుపోయినందుకు చంద్రబాబు నాయుడు కు శిక్ష పడిందని దర్యాప్తు సక్రమంగా చేపట్టకపోగా అధికార పార్టీ తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్నారు ఈ రిలే నిరాహార దీక్ష కార్యక్రమం ప్రతి మండల కేంద్రంలోనూ జరుగుతూ ఉంటుందని చంద్రబాబు నాయుడు ని బేషరతుగా విడుదల చేయాలని అంతవరకు రాష్ట్రం మొత్తం పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షులు కోక ప్రకాష్ నాయుడు ,సర్పంచి మురళి, మాజీ ఏఎంసి ఛైర్మన్ జయచంద్ర నాయుడు, మాజీ సింగల్ విండో అధ్యక్షులు హేమచంద్ర నాయుడు ,మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, కృష్ణకుమారి, రాధిక రమేష్, గిరిబాబు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

.గ్రామాల్లో వైద్య సిబ్బంది స్వచ్ఛభారత్




ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని దాసర్లపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న దాసర్లపల్లి గ్రామంలో తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్య సిబ్బంది దాసర్లపల్లి గ్రామానికి చేరుకొని ఆరోగ్య విస్తరణ అధికారి లక్ష్మీనారాయణదాసర్లపల్లి గ్రామములో , నిలువ ఉన్న నీటి తెట్టెలను , మురికి కాలువలు మొదలగు వాటిని పరిశీలించి , ఫ్రైడే , డ్రైడే గురించి, వ్యక్తిగత పరిశుభ్రత , పరిసరాల పరిశుభ్రత ల గురించి అవగాహన కల్పించడం, సెప్టెంబర్ 20వ తేదీ నుండి అక్టోబర్ మన వం కు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇంటింటి ఫీవర్ సర్వే చేస్తూ మలేరియా , డెంగీ, టైఫాయిడ్ మొదలగు జబ్బుల లక్షణాలు వాటి నివారణ గురించి వివరిస్తూ, మందులు అందించారు. ఈ కార్యక్రమం లో తీర్థం పి. హెచ్.సి. ఆరోగ్య విస్తరణ అధికారి లక్ష్మీనారాయణ , ఆరోగ్య సిబ్బంది కవిత , ఎం. ఎల్. హెచ్ .పి నవీన , ఆశా రామంజనమ్మ పాల్గొన్నారు.

మైనింగ్ మిషన్ తనిఖీ

ప్రజాశక్తి -శాంతిపురం: గుంజార్లపల్లి పంచాయతీ పరిధిలోని ఎమ్మెస్సార్ కాలనీలోని మైనింగ్ మిషన్ ను భూగర్భ గనుల శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా గ్రామకంఠం స్థలంలో అక్రమ రాతి పరిశ్రమ నడుపుతున్న విషయం మీద జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారులకు ఫిర్యాదు అందడంతో శుక్రవారం ఏడి స్థాయి అధికారి, వారి బృందం అక్రమ క్రషింగ్ మిషన్ ను పరిశీలించారు.అక్కడే ఉంచిన మహారాష్ట్ర లారీలు తనిఖీ చేసి అక్కడున్న రాతి పరిశ్రమ నిక్షేపాలను కొలతలు తీసుకుని సంబంధిత అక్రమ క్రషర్ మిషన్ నడుపుతున్న గణపతిని ఫోన్ ద్వారా వివరణ కోరారు.పనులను వెంటనే ఆపివేయాలని హెచ్చరికలు జారీ చేస్తూ 24 గంటల లోపు సంబంధిత రికార్డులు పలమనేరు లోని భూగర్భ గనుల శాఖ కార్యాలయం తీసుకురావాలని తెలిపారు.గుంజార్లపల్లి పంచాయతీ కార్యదర్శి అదే సమయానికి అక్కడికి చేరుకుని నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న పనులను తక్షణమే నిలిపేయాలని అక్కడ ఉన్న సిబ్బందితో తెలిపారు.నోటీసు తీసుకోవడానికి సంబంధిత వ్యక్తి గణపతి ఫోన్ చేయగా అతను ఎంతసేపటికి రాకపోగా నోటీసును గోడ కు అతికించామని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.ఈ మెరుపు దాడులలో భూగర్భ గనుల శాఖ పలమనేరు ఎడి మరియు వారి బృందం, పంచాయతీ కార్యదర్శులు బి సుబ్రహ్మణ్యం,ఎస్ సురేష్ లు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి



ప్రజాశక్తి-రొంపిచెర్ల: రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని రొంపిచెర్ల మండల టీడీపీ సీనియర్ నాయకులు గుండ్లూరు రామచంద్రారెడ్డి శుక్రవారం కలిశారు. టీడీపీ నాయకులు గుండ్లూరు రామచంద్రారెడ్డి గతంలో రెండు సార్లు టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. టీడీపీ పార్టీలో డబ్బు ఎంత ఖర్చు చేసినా గుర్తింపు లేదని దూరంగా ఉన్నట్లు తెలిసింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా గుండ్లూరు రామచంద్రారెడ్డి టీడీపీకి దూరంగా ఉన్నారు. పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి చల్లా రామచంద్రా రెడ్డి సొంత గ్రామం బొమ్మయ్య గారి పల్లి చెందిన గుండ్లూరు రామచంద్రారెడ్డి తన అనుచరులతో కలిసి భారీ ఎత్తున వైసిపిలోకి చేరేం దుకు ప్రయత్నాలు చేస్తు న్నట్లు సమాచారం. త్వరలోనే మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరను న్నారు. బొమ్మయ్యగారి పల్లిలోనే టీడీపీ నాయకులు వైసిపిలోకి చేరు తుండడంతో టీడీపీ కార్యకర్తలు ఆందోళన చెందు తున్నారు. ఎన్నికల సమీపించే కొద్దీ చేరికల పర్వం ఎక్కువ గా కొనసాగుతోందని అందరూ భావిస్తున్నారు.


అంగన్‌వాడీ టీచర్ కు నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-రొంపిచెర్ల: మండలంలోని రొంపిచెర్ల-3 అంగన్‌వాడీ టీచర్ గా ఎంపికైన భవిత కు నియామక పత్రాలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం అందజేశారు. ఇక్కడ అంగన్‌వాడీటీచర్ గా పని చేస్తున్న అనసూయ గత 15 రోజుల క్రితం పదవి విరమణ చేయడంతో ఐసీడీఎస్ పీడీ నాగ శైలజ ఇంటర్వ్యూలు నిర్వహించి దద్దాలవారి పల్లికి చెందిన భవిత ను ఎంపిక చేశారు. దీంతో మంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. విధి నిర్వహణలో మంచి పేరు తీసుకుని రావాలని టీచర్ భవిత ను మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైసిపి నాయకులు ఉమాపతి నాయుడు, శ్రీకాంత్ నాయుడు, తులసి నాయుడు పాల్గొన్నారు.

వైసిపి కన్వీనర్ గా ఇబ్రహీం ఖాన్

ప్రజాశక్తి-రొంపిచెర్ల: రొంపిచెర్ల మండల వైసిపి కన్వీనర్ గా ఇబ్రహీం ఖాన్ నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. సర్పంచ్ ఇబ్రహీంఖాన్ మంత్రి పెద్దిరెడ్డికి ముఖ్య అనుచరుగా కొనసాగుతున్నారు. రెండు సార్లు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా, ఎంపీటీసీగా పనిచేశారు. ప్రస్తుతం సర్పంచ్ గా వున్న ఆయనకు వైసిపి మండల కన్వీనర్ గా బాధ్యతలు అందజేశారు. ఆయన భార్య నీలూఫర్ మునుపు జెడ్పీటీసీగా పనిచేశారు. ఎన్నికల దగ్గర పడుతుండటంతో వైసిపి కమిటీలను ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమంలో ఇబ్రహీంఖాన్ ను మండల కన్వీనర్ గా ఎంపిక చేశారు. దీనిపై ఇబ్రహీం ఖాన్ మాట్లాడుతూ తమకు రాజకీయ బిక్ష పెట్టిన దేవుడు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని అన్నారు. తన ప్రాణం ఉన్నంత వరకు మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం కోసం పాటుపడతానని తెలియజేశారు. తన నియామకానికి కృషి చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి కి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డికి రుణపడి ఉంటానని తెలిపారు.

తిరుమలలో రెండు పార్కులు ప్రారంభం


తిరుమలలో పార్కులను ప్రారంభిస్తున్న టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి, ఈవో ఏవి.ధర్మారెడ్డి

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల సుందరీకరణలో భాగంగా దాత రవికుమార్ సహాయంతో ఫిల్టర్ హౌస్ వద్ద, జిఎన్‌సీ వద్ద అభివృద్ధి చేసిన రెండు పార్కులను శుక్రవారం రాత్రి టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి, ఈవో ఏవి.ధర్మారెడ్డి ప్రారంభించారు. ఫిల్టర్ హౌస్ వద్ద అన్నమయ్య సర్కిల్ పార్కును రంగురంగుల పూలమొక్కలు, పచ్చని మైదానంతో సుందరంగా రూపొందించారు. ఇక్కడి ఫౌంటెన్ లో అన్నమయ్య సంకీర్తనలు వినిపించే వ్యవస్థను ఏర్పాటు చేశారు. పార్కు అభివృద్ధికి రూ. 8 లక్షలు, ఐదేళ్ల పాటు నిర్వహణకు రూ.30 లక్షలను దాత అందించారు. జిఎన్‌సీ వద్ద రూపొందించిన పార్కులో 65 హై ఎండ్ ప్రొజెక్టెడ్ లైట్లు, శంకు చక్ర నామాలతో కూడిన ఫౌంటెన్ ఉన్నాయి. ఈ పార్కు అభివృద్ధికి రూ.15 లక్షలు, ఐదేళ్ల నిర్వహణ కోసం రూ.80 లక్షలను దాత అందించారు. ఈ కార్యక్రమంలో జెఈవో వీరబ్రహ్మం, ఎస్ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, డెప్యూటీ సీఎఫ్ శ్రీనివాసులు, ఈఈ శ్రీహరి, విజివో బాలిరెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహార వారోత్సవాలు

ప్రజాశక్తి-పలమనేరు: మండల పరిధిలోని కొలమాసన పల్లి సెక్టార్ పరిధి లో శుక్ర వారం పౌష్టిక ఆహార వారోత్సవాల సందర్భంగా తల్లి పిల్లలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసిడి ఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ ఇందిరా ప్రియదర్శిని, సర్పంచుల సంఘం అధ్యక్షులు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ అధిక పోషకాలు గల పౌష్టిక ఆహార పదార్థాలను గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా తీసుకుంటే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు అంగన్‌వాడీ కార్యకర్తలు ఆ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించా లన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం నక్కపల్లి, కురపల్లి, జగమర్ల, మొరం, కూర్మాయి-2 అంగన్వాడి కేంద్రాల నందు పిల్లలకు, స్కూలుకు పలు రకాల సామాగ్రిని పలమనేరు చెందిన శ్రీపురం సీతారామయ్య అందజేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారికి పూల మాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపి పి గజేంద్ర, సూపర్వైజర్ నగ్మా అంగన్‌వాడీ టీచర్లు , భారతి, రాణి,రెడ్డెమ్మ, నిర్మల, కాంతమ్మ ఆశ వర్కర్లు మహిళా పోలీసు వాలంటరీ గ్రామస్తులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



ప్రజాశక్తి- పలమనేరు:మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ పలమనేరు న్యాయ వాదులు పలమనేరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడుకు సంఘీభావంగా ప్లకార్డులను చేతబట్టి 'మేము సైతం చంద్రబాబుతోనే ' అంటూ నినాదాలు చేశారు. చట్ట విరుద్ధంగా చంద్రబాబు నాయుడు అరెస్టు చేశారని దాన్ని పూర్తిగా తాము వ్యతిరేకిస్తున్నామని న్యాయవాదులు లక్ష్మీపతి, ఎల్. భాస్కర్,లోకేష్, జగదీష్,కృష్ణలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణ నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీగా వస్తున్న న్యాయవాదులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో న్యాయవాదులకు పోలీసులకు మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. తాము నిరసన తెలియజేసే హక్కు కూడా లేదా అంటూ పోలీసుల తీరుకు నిరసనగా న్యాయవాదులు నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో లక్ష్మణ్, సుబ్బరామయ్య, షరీఫ్, కృష్ణ, ఫామీద్ బాషా, మునిరాజులు, పార్థసారథి, చంద్ర, గాంధీ,రాజు, రాజశేఖర్, సంధ్య,చాందిని పాల్గొన్నారు.

టిడిపి తెలుగు మహిత్న వినూత్న దీక్ష

ప్రజాశక్తి -నగరి: తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ నగరి నియోజకవర్గం తెలుగు మహిళల ఆధ్వర్యంలో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. నగరిలో చేపట్టిన రిలే నిరాహారదీక్ష లో టిడిపి రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి మీరా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE OF CHITTOOR
I.P.No. 53 of 2022

Between:
D.Pradeep ...Petitioner/Creditor
And:
1.V.Hemanth
2.N.Baba Kishore ...Respondents

NOTICE 2ND RESPONDENT

To:
R2)N.Baba Kisore,
S/o Nakkala Jayarama Reddy,
aged about 46 years,residing at
Vengampalli Village and Post,
Thavanampalli Mandal,
Chittoor District

Sir, Please take notice that above named petitioner/Creditor filed the above IP against both of you same is posted to 06-10-2023. Hence you are directed to appear before said court on **06-10-2023 at 10-30 A.M** either in person or through your advocate file your objections if any, failing which the matter will be decided according to law.

Sd/-Smt A.S.SARASWATHY
Advocate for Petitioner
Place : Chittoor, Date: 14-09-2023